# దింపుడు కళ్లం ఆశ

-వేంపల్లి గంగాధర్

ఆకాశం నిండా నల్లమబ్బు మోడాలు నీడలు పడతా వుండాయి. అప్పుడప్పుడు గుండెను తెరిచి కన్నీటి చినుకుల్ని రాల్చుతూ తమ దుఃఖాన్ని ప్రకటిస్తున్నాయి. ఊరంతా నిశ్శబ్దంగా వుంది. ఎద్దుల మెడలోని గంటలు మోగడం లేదు. రావిచెట్టు మీద పక్షుల సవ్వడి లేదు. తొలికోడి కూత కంటే ముందే కొండకు బయలుదేరే పశువులు ఎక్కడుంటే అక్కడ కూలబడి వుండాయి. రహమతుల్లా టీ కొట్టు పెట్టలేదు. రచ్చబండ పైకి చేరిన ఆ రోజు దినపత్రిక శకలాలుగా మారి గాలికి ఎగిరి పోతోంది. డేవిడ్ రైస్‌మిల్లు నుంచి యంత్రం శబ్దం వినపడడం లేదు. తిమ్మరాజు టింబర్ డిపో నుంచి వచ్చే గొడ్డళ్ళ చప్పుడు లేదు. మొదటి బస్సుకు పట్నానికెళ్ళే పేకాట రమణయ్య, సినిమా పిచ్చి ఆంజనేయులు, టీచరు సుశీలమ్మ, ఫ్యాక్షన్ కృష్ణారెడ్డి, కువైట్ పార్టీ జమాల్ భాషా, కోర్టు డ్యూటీ సత్యరాజు, పర్సెంటేజీల ప్రభాకరం, వడ్డీ వసూళ్ళ నాగరాజు, ఆకుతోటల శంకరయ్య అందరూ వాళ్ళ పనులు మానుకున్నారు. ఊరు ఊరంతా బోసిపోయినట్లుండాది. ఊరికేదో శాపం కొట్టినట్లుండాది. అందరి కళ్ళలోను కన్నీటి సముద్రాలు...

రాతిమిద్దె వసారాలో పంచన తల పక్క దీపం కాంతిలో వెలిగిపోతున్న చిరునవ్వుల ప్రసన్నవదనం... మూసిన కనురెప్పల మీద కొన్ని బియ్యం గింజలు... అటువైపు నుంచి అగరొత్తుల పొగ... చుట్టూ నిశ్శబ్దం ఆవరించి వుంది. ఇక ఏడ్వడానికి కూడా ఎవరికీ శక్తి లేదు. సత్తువ లేకుండా కుప్పకూలిపోయిన ఎంతో మంది మెట్లపైన, వేపమాను కింద, వసారా కట్టపైన, రామాలయం దగ్గర మౌనంగా దిగులు చేస్తాండరు.

ఊర్లో ఎప్పుడూ యింత విషాదం చూసిందిలేదు. ఎప్పటిలాగానే ఈ రోజు కూడా తెల్లారిందే గానీ... యింత బాధను మిగుల్చుతాదని ఎవరూ అనుకోలేదు. మంచి మనుషులందే ఈ విధికి యింత కోపం ఎందుకో అర్థం కాదు. వాళ్ళను తనతో పాటూ లాక్కెళ్ళే వరకు విశ్రమించదు కదా!

ఎట్లాటి మనిషి... ఎదుటి వాడికి కష్టం వస్తే తనకు కష్టం కలిగినట్లు ఆరాట పడే మనిషి... ఎవరికైనా బాధ కలిగితే తనకు బాధ కల్గినట్లు విలవిలలాడే మనిషి... సాటి మనుషుల కోసం ప్రాణంపెట్టి బతికే మనిషి... ఎంత తపన పడేవాడో... ఎంత తాపత్రయ పడేవాడో... అట్లాటి మనిషికి కూడా ఇంతటి విషాదం ఏమిటి? విధి లిఖితం కాకుంటే!

అందరి హృదయాల్లోనూ విషాద తరంగాలు...

ధర్మారెడ్డి చనిపోయినాడనే చెడు సంఘటన.

నిజం కాకుంటే ఎంత బాగుండేది అనే ఆశ.

దేవుడిలాంటి మనిషి మళ్ళీ బతికి వస్తే బాగుండుననే....

ఆకాంక్ష.... చినుకులు... చి....ను...కు...లు కురుస్తున్నాయి.

○○○

ధర్మారెడ్డి.... ధర్మాత్ముడు... పేరుకు తగినట్లు

పెద్దరికం నిలుపుకునే వ్యక్తి. చుట్టు పక్క నలభై నాలుగు

పల్లెల్లోనూ మంచిపేరున్న మనిషి. ఎప్పుడూ పెదవులపైన చెరగని చిరునవ్వు. ఆత్మీయ చూపు. రచ్చబండ రావిచెట్టు కింద బండపైన తుండుగడ్డ భుజానికేసుకొని ఊరి జనానికి మంచి చెడులు చెప్పే తీరు... తప్పుచేసిన వాళ్ళను కూడా సున్నితంగా మందలించే నైజం... ఆ వయస్సులోనూ చూడగానే ఆకట్టుకునే రూపం....

"రేయ్....పాపోడా!

"నేను జెప్పేది చెప్తావుండాను. ఆ తర్వాత మీ ఇష్టం. ఆర్నెళ్ళ క్రితం ఆ సిద్ధినాయుడు మీ తోటలోని నాలుగు వందల చీనీచెట్లు నరికినాడని.... మీరు ఇప్పటికీ అదే ప్రతీకారంతో ఆలోచిస్తావుంటే ఈ మంటలు యిక్కడితోనే ఆగిపోవు. పల్లెంతా పచ్చగా వుండాది. జరిగిందేదో జరిగిపోయింది. రెండు పార్టీలై వీరు ఇట్నే పగలు, సెగలని అంటా వుంటే దిన్నం పేపర్లలోకి ఊరు ఎక్కడమే గానీ ఊరు ఉన్నతంగా పైకి వచ్చేది ఏం వుండదు. చూడండి... ఊర్లో ఏముండాయి. బడిలేదు. గుడిలేదు. రోడ్డు లేదు... బస్సులేదు. ఆసుపత్రి లేదు. కరెంటు ఎప్పుడుంటుందో తెలియదు. ఒక్క అధికారైనా ఇక్కడకు వస్తాండాడ... ఆలోచించండి" చెప్పినాడు ధర్మారెడ్డి. కృష్ణారెడ్డి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

రచ్చబండ రావిచెట్టు గలగలా వీస్తాంది.

'ఊరుకోన్న....

ఆ సిద్ధినాయుడుగాడు ఏమనుకుంటాండడు?

ఊర్లో వాడొక్కడేనా పోటు మొగోడు...

మేమేం సేతులకు గాజులేసుకొని కూకొని వుండామా...

నువ్వు జెప్పితే నీ మాటకు ఎదురు చెప్పం.

ఊరు బాగుకోసం ఏందైనా జేస్తాం.

మా జోలికి రావాకుమని వాళ్ళకు కూడా

నువ్వు జెప్పాలి'- చెప్పినాడు కృష్ణారెడ్డి సమాధానంగా.

'ఆ సిద్ధినాయుడుకు కూడా చెప్పినారా... పాపోడా.... వాడూ ఇదే మాట అన్నాడు. ఊరు బాగు కోసం ఏదైనా జేస్తానన్నే... మీరిద్దరూ ఎవరి పని కొద్ది వాళ్ళుంటే చాలు... ఊరుకు మంచిపేరు రాకున్నా పీడపాయె... చెడ్డపేరు తేకుండా చూడండి... ఇదే నే మీ ఇద్దరికీ జెప్పేది' తన మనసులోని మాటను చెప్పినాడు ధర్మారెడ్డి ఆర్ద్రతగా.

'నువ్వు ఎట్ల చెప్పితే... అట్నేలేన్నా...' అని చెప్పి వెళ్ళిపోయినాడు రచ్చబండ కట్ట దిగి కృష్ణారెడ్డి ఊర్లోకి.

"ఊరి సంక్షేమం ఆశించో, ధర్మారెడ్డి మాటను గౌరవించో ఆతర్వాత సిద్ధి నాయుడు, కృష్ణారెడ్డి గొడవ పడింది గానీ, ఆస్తులు నష్టం చేసుకుందిగానీ జరగ లేదు.

ООО

మా ఊరి పేరు వీరాపురం. అయిదువేల మంది జనాభా వున్న గ్రామంలో మూడున్నర వేలు మంది ఓటర్లున్నారు. దాదాపు వెయ్యి ఇళ్ళున్నాయి. అన్నీ వ్యవసాయాన్ని నమ్ముకున్న కుటుంబాలే. కొమ్మన వారి కోన మీదుగా వచ్చే పాపాఘ్ని నది వీరాపురం వంకకు చేరుకోవాలి. నది ఎండి పోయింది. ఇసుక మేటలు కట్టింది. ఊరి జనమంతా దేవర్లు జేసినా, బలి ఇచ్చినా,... శిల బండ్లు కట్టినా చినుకులు కుర్సింది లేదు. నేల తడిసింది లేదు. బీడు పడ్డ పొలాలతో ఊరు దిష్టిబొమ్మలాగా తయారైంది.

ఎప్పుడూ లేంది ఊర్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చారు. రచ్చబండ దగ్గరికొచ్చి పంచాయతీ పెట్టారు. 'భూమి పొరల్లో నీటి శాతం పడిపోయింది. ఈసారి నీటి ఆధారిత పంటలు వేయకూడదని గవర్నమెంటు ప్రకటించింది. కరువు దెబ్బకు పంటలు పోయినోళ్ళు బ్యాంకులోన్లు మాత్రం కట్టాల్సిందేనని' చెప్పినాడు భూతద్దాల కళ్ళజోడు పెట్టుకొని బానంత పొట్ట వేసుకొని బొడ్డు కిందకి వున్న తెల్లటి ప్యాంటుపై నల్ల చారల చొక్కా తొడుక్కున్న వ్యవసాయ శాస్త్రవేత్త.

'కట్టాల్సిందే... లోన్లు ఎగిరిపోవు....

తప్పించుకోవాలని జూస్తే వేలమేస్తాం'

పళ్ళు యికిలిస్తా చెప్పినాడు శాస్త్రవేత్తతో పాటూ వచ్చిన బ్యాంకు ఉద్యోగి.

ఆ మాట వినగానే సీతారాముడి భార్య రమణమ్మ ఏడుపెత్తుకుంది. ఆయమ్మ పరిస్థితి అధ్వాన్నంగా వుండాది. ఎవరూ తీర్చలేని శోకం... పెగిలి వస్తున్న దుఃఖం... సీతారాముడికి ఊర్లో వంకకు ఆనుకొని మంచి భూమి నాలుగెకరాలుండేది. మూడేళ్ళ క్రితం వరకు బాగా బతికినోడు. కానీ వానల్లేక పోవడంతో పత్తి, మిరప పంటలు కూడా పోయినాయి. చివరికి రెండు లక్షలు అప్పు మిగిలింది. వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టుకోలేకపోయినాడు. భూమంటే పంచ ప్రాణాలు. దాన్ని అమ్మను మనసు ఒప్పలేదు. ముగ్గురు ఆడకూతుర్లను తనివి తీరా సూసుకొని ఓ రోజు మిట్ట మధ్యాహ్నమప్పుడు సేలోని యాపమానుకాడ కూర్చోని పురుగుల మందు తనివి తీరా తాగి ప్రాణమిడిసినాడు. దాంతో రమణమ్మ ఒంటెద్దులా బతుకుభారాన్ని మోయాల్సి వచ్చింది.

సీతారాముడు చనిపోవడంతో డబ్బిచ్చిన వడ్డీ వ్యాపారులంతా రాబందుల్లా వెంట పడ్డారు. తీసుకున్న అప్పుకు చక్రవడ్డీలు, బారువడ్డీలు కలిపి లెక్కలు చూపించారు.

'మొగుడు పోయి ఆ యమ్మి ఏడుస్తాంటే...

మీ రావడి ఏంది? పైసా లెక్క కట్టదు పొండి...

ఏం చేస్తారో చేస్కోండి... మీరేమైనా ఆ యమ్మి

చేతికి లెక్కిచ్చినారా? ఆ యమ్మిని అడిగిచ్చినారా?'

- కోపంగా గదురుకున్నాడు ధర్మారెడ్డి వాళ్ళను.

మాటామాటా పెరిగింది.

గొడవైంది. పంచాయతీ పెట్టినాడు.

'భూమికోసం నా మొగుడు అప్పుజేసింది నిజమే.

నా దగ్గర లెఖ్ఖయాడుంది? అయినా తీసుకున్న

పాపానికి కట్టాల్సిందే. ఎట్లైనా కడతా..' చెప్పింది రమణమ్మ కన్నీళ్లతో.

మరో వారం రోజులకు గొడ్లు, బోరు మోటారు, సొంత ఇల్లు అమ్ముడైనాయి. సగం వరకు అప్పు తీర్చింది. ఇంకొంత మంది అప్పులోళ్ళకు రెండు ఎకరాల భూమి అమ్మేసింది. ఆమె బాధ సూడలేక ధర్మారెడ్డి

వుండడానికి పాతమిద్దె యిచ్చినాడు. ముగ్గురు కూతుళ్ళతో కుటుంబాన్ని ఈదలేక అవస్థలు పడుతుండే రమణమ్మకు పనికి ఆహార పథకం కింద వచ్చిన పని ఒకటి కొండాపురం మండలానికి వచ్చింటే కుదిర్చి నాడు. కూలి పనికి పోవడం బిడ్డల్ని పోషించుకోవడం చేస్తాంది.

ఇప్పుడు వున్నట్లుండి బ్యాంకులోను తీర్చమంటే ఎట్లా తీరుస్తుంది? ఇట్లాటి పరిస్థితే ఊర్లో పది, పన్నెండు కుటుంబాలకు కూడా వుంది. వీళ్ళందరూ కూడా ఒంటి చేత్తో ఇల్లు గడుపుతూ పిల్లల్ని పోషించుకుంటున్న వాళ్ళే.

'బ్యాంకు లోను కట్టాల్సిందే' అనడంతో వీరందరి కళ్ళలోను వెలుగూ లేకుండా పోయింది.

వాళ్ళ నుదుటన చిటికెడంత బొట్టు లేకపోవడమే కాదు...

మనసారా ఏడ్వడానికి కన్నీళ్లు కూడా లేవు....

'అధికారులూ... రాకరాక మా ఊరికి వచ్చినారు...

మంచిది... ఇదిగోండి వినతి పత్రం తీసుకోండి.

నదులన్నీ ఎండిపోయినాయి.... చెరువులన్నీ ఎండి పోయినాయి.

జీవాలు తినను యింత పచ్చమేత కూడా యాడ లేదు.

తీసుకున్న లోన్లు కట్టమంటే యాన్నుంచి తెచ్చికడ తారు?

ఊర్లో యిప్పటికే పదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మీ కింకా బుద్ధిరాకపోతే ఎట్లా?

మేం పైసా కట్టం. మీరిష్టమొచ్చింది చేస్కోపొండి..

చెప్పినాడు ధర్మారెడ్డి వినతిపత్రం కాగితం అంద జేస్తా.

ఊరి జనం కోపంతో వున్న సంగతి గ్రహించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, బ్యాంకు అధికారులు అక్క ద్నుంచి చిన్నగా జారుకున్నారు. ఆ తర్వాత చుట్టుపక్కల పదారు మండలాల్లోనూ రైతులు ఇదేవిధంగా నిరసన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఆలోచనలో పడింది. వచ్చేది ఎన్నికల కాలం కాబట్టి రైతుల్ని దువ్వుకుంటే గానీ పని జరగదని అధికార పార్టీ గ్రహించింది. ఈ మండలాలన్నింటిని కరువు ప్రాంతంగా రికార్టుల్లో చూపించి బ్యాంకు లోన్లు ఎత్తేశారు.

ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను ఆదుకోవ డానికి కూడా అధికారులు గ్రామాలకు తరలివచ్చారు. 'ఈ పుణ్యమంతా ధర్మాత్ముడు మా ధర్మారెడ్డికే దక్కుతా దని' ఊర్లకు ఊర్లు సంబరపడినాయి. అందరి కళ్ళ వెలుగులోనూ ధర్మారెడ్డి కన్పించినాడు.

○○○

సర్పంచ్ ఎన్నికలు వచ్చినాయి.

ముందే పచ్చగడ్డి ఏస్తే బగ్గుమనే ఊరు.

ఈసారి ఎంతమంది చస్తారో... ఏమోనని ఊరం తా దిగులు పడింది. ఆధిపత్యాన్ని నిరూపించుకోవడం కోసం కృష్ణారెడ్డి, సిద్ధినాయుడు సిద్ధమైనారు. పట్నానికి పోయి ఇద్దరూ ఒక్కో పార్టీ వాళ్ళతో మాట్లాడుకొని వచ్చినారు.

'అన్న... నువ్వు మా తరపున ఈసారి సర్పంచ్ కావాలి...' అని కృష్ణారెడ్డి అడిగిపోయిన కొంత సేపటికి, ఎట్లైనా గానీ మా తరపున నువ్వు నిలబడున్న' అని సిద్ధినాయుడు వచ్చి ధర్మారెడ్డి ఇంటి ముందు కూర్చు న్నాడు.

'సామీ.... మనకు ఆ రాజకీయాల పీడ వద్దు. వాళ్లే కొట్టుకొని సావనీలే... మనకెందుకు... నువ్వు ఆ కంపులోకి దిగితే బాగుండదు సూడు... ముందే చెప్తాండ...' అని భార్య యశోదమ్మ ధర్మారెడ్డిని కట్టమీద కూర్చోబెట్టి వివరంగా చెప్పింది.

'నువ్వు అమ్మ మాట విని... ఊరుకో నాయన... పట్నంలో నాకు మంచి ఉద్యోగం దొరికితే అందరం అక్కడికే వెళ్ళిపోదాం... ఈ ఊరే మనకొద్దు' అని చెప్పి నాడు కొడుకు రవిరెడ్డి.

'మనకేంటికిలే ఆ పాడు రాజకీయాలు.

### కళ్ళు

అంతరాంతరాల్లో చీకటి తెరల్లో
దాగిన హృదయాన్ని
మనముందు ప్రదర్శించే
టి.వి. తెరలు కళ్ళు
హృదయ సంకేతాల్ని ఫోటోలు తీసే
ఎక్స్‌రే యంత్రాలు కళ్ళు
హృదయం ఆగ్రహిస్తే
కన్నుల్లో ఎర్రజీరలు
మనసు సంతోషిస్తే
పొరలి వచ్చే ఆనంద బాష్పాలు
అందుకే ఈ కళ్ళు
హృదయానికి సంకేతాలు
మనస్సుకు మరో రూపాలు

**-ఎస్. ప్రభాకరాచార్యులు**

మనకు ఉన్నిన కాడికి మనం ఉందాం' అని వారించి నారు కూతురు శ్రీలక్ష్మి, కోడలు లావణ్య ఇద్దరూ.

రాత్రంతా ధర్మారెడ్డి ఆలోచనలో పడ్డాడు.

తెల్లారింది.

రెండు వర్గాల వారిని రచ్చబండ వద్దకు రమ్మని చెప్పినాడు.

'మేం చెప్పిన మాటలు గుర్తున్నాయి కదా! ఈ రాజకీయాలు మనకొద్దు....' మరోసారి గట్టిగా గుర్తు చేసినారు కుటుంబ సభ్యులు కొంతసేపటికి అందరూ గుమిగూడారు. ధర్మారెడ్డి చెప్పడం మొదలు పెట్టాడు.

'నా పైన అభిమానంతో మీరిద్దరూ చూపిన కృతజ్ఞ తకు సంతోషం. కానీ ఒక్క విషయం. మన ఊర్లో సర్పంచులుగా ఇంతకాలం రెడ్లో, నాయుడ్లో పనిచేస్తా వచ్చినారు. ఇక్కడింకా బిసిలు, ఎస్సీలు, ఎస్టీలు కూడా వున్నారు. ఈ సీటు కులాలకు రిజర్వు కాకపోయినా ఈ సారి వాళ్ళల్లో ఒకరికిచ్చి ఏకగ్రీవం చేద్దాం. నా అభిప్రాయమిది" చెప్పినాడు ధర్మారెడ్డి.

అందరూ ఆలోచనలో పడ్డారు.

పెద్దాయన చెప్పే మాటలు వినడమా?

ఆధిపత్యపోరు కోసం పోటీకి దిగడమా?

రెండు వర్గాల్లోనూ ఇదే అంతర్మథనం.

'పెద్దోడివి... నువ్వు ఎట్లాజెప్పితే అట్నేలేన్నా...'

## స్నేహం

నిత్య హితవుగా నిలిచేది
సన్నిహితమై నిలబడేది
స్నేహం!
అంటిపెట్టుకునుండే వోడు
అనుసరించే నీడ స్నేహం
బాధ్యతగా ఒక బంధమది
బతుక్కు బాసటగా అందమది

○○○

లెక్కల్లోకి దించొద్దు
స్నేహాన్ని ముక్కలు చేసి ఆడొద్దు
వెలకట్టి వీధుల్లో సరుకుల్లా
అమ్మొద్దు కొనొద్దు
చమక్కులు జిమిక్కులతో
ఎంచొద్దు తుంచొద్దు
స్నేహం! అద్దంలో మన ముఖమే..!

–అనిశెట్టి రచన

అని రెండు వర్గాలూ ఒక కొలిక్కి వచ్చి తమ అభి ప్రాయాన్ని తెలిపాయి. ఊర్లో ఇరవై మంది మాత్రమే ఎస్టీ ఓటర్ల నుండి మూడే బత్తెన్నను సర్పంచ్ కోసం ఎంపిక చేశారు. ఏకగ్రీవంగా రెండు వర్గాల వారు ఒప్పుకోవడంతో అదొక సంచలనమైంది.

రక్తం పారి ఎందర్ని బలి తీసుకుంటాయోనని అం దరూ భావిస్తూ వచ్చిన ఎన్నికలు ప్రశాంతంగా ముగి శాయి. పేదవర్గాల వారికి ధర్మారెడ్డి దేవుడిలా మారా డు. చివరి శ్వాస వరకు ఊరు ప్రగతినే స్వప్నించాడు.

○○○

కాల ప్రవాహంలో ఊరి అభివృద్ధి కోసం, ఉన్నతి కోసం జనాన్ని కూడగట్టుకొని అధికారులందర్నీ కది లించాడు. చూస్తుండగానే ఊరికి బిడి వచ్చింది. ఎంపీ ఫండ్స్ నుంచి రోడ్డు ఏర్పాటైంది. రోగమొస్తే మైళ్ళకు మైళ్ళు పరిగెత్తకుండా ఆసుపత్రి ఊర్లోకే వచ్చింది. ఊర్లోని నలభై శాతం మట్టి ఇళ్ళకు కొత్త రూపు వచ్చింది. పక్కా గృహాలు నిర్మితమయ్యాయి. లో ఓల్టేజి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయి. శ్రమదానంతో గ్రామస్తులందరూ కలిసి వీరాపురం వంకను బాగు చేసుకున్నారు. గుడి ఒకటి నిర్మించుకున్నారు. నీళ్ళ ట్యాంకు ఏర్పాటైంది. పంటకు కాల్వల నుంచి నీటి సాయం, తోటల్లో డ్రిప్ ఇరిగేషన్... ఇలా ఎన్నో ధర్మారెడ్డి కృషి ఫలితంగా సాకారమయ్యాయి.

○○○

'చినుకులు తగ్గినాయి... ఆ రెండు కొయ్యలు పాట్రారా... అబ్బిగా' కేకేసినాడు జంగమోళ్ళ నాగన్న, 'అట్నే లేన్నా...' అని చినుకుల్లోనే తడుసుకుంటా పోయి రెండు కొయ్యలు భుజానికి ఎత్తుకొని వచ్చినాడు – యానాదోళ్ళ అంకన్న.

రెండు కొయ్యలు నిలువుగా వుంచి వెదురుదబ్బలు చీల్చి నిలువులకు అడ్డంగా రెండు దబ్బలను క్రాస్‌గా వుంచి ఐదు వరసలు కట్టినారు. రాగి నారతో ఈ దబ్బలకు నిలువులను గట్టిగా కదలకుండా కట్టినారు. దానిపైన టెంకాయిపట్టలు, సొద్దచొప్ప ఒత్తుగా పరిచి పాడెను తయారు చేసినారు. ఇంగ మిగిలింది ధర్మారెడ్డి శవాన్ని తీసుకొచ్చి పాడెపైన పడుకోబెట్టడమే!

రామాలయం దగ్గర ఎండుగడ్డిని మండించి తప్పె టకు సెగకాంచిన మాదిగోళ్ళ ఓబన్న పుల్లలు సరిచూసు కొని కొట్టడం మొదలు పెట్టినాడు. ఓబన్నతో పాటే పాపోడు, అంజన్న, గంగులయ్యల తప్పెట్లు కూడా మోగతాండయి.

'జెగ్గినక్.... జెగ్గినక్.... జగ్గిజగ్గి.... జెగ్గిజెగ్గిజెగ్గి నక్.... పలకలు పదును మీదుండాయి.

'రేయ్... అంకన్న... వసారాలో పైన దంతెలకాడ తెల్ల కొత్త గుడ్డ వుంది.... ఎత్తకరా...' మళ్లీ కేకేసినాడు నాగన్న.

అంకన్న పరుగు పరుగున లోపలికెళ్లి వసారాలో పైన పెట్టిన తెల్ల సైను గుడ్డ తెచ్చిచ్చినాడు.

పాడె మీద ఐదుమూర్ల తెల్లటి కొత్తగుడ్డ విదిలించి కొసలను నాలుగు మూలలా కట్టి నిండుగా పరిచినాడే గాని నాగన్న కళ్లల్లో కన్నీళ్లు చిట్లాయి.

బయట పలకల శబ్దం మోగుతానే వుంది. రాతి మిద్దె ముంగిట్లో తలుపులు దాటుకొని ఎదురుగా వేసిన పందిట్లోకి శవాన్ని మోసుకొచ్చినారు.

మూడు ఎదురు గంపలను బోర్లించి దాని మీద ఆ ప్రక్క ఈ ప్రక్క రెట్టలు పట్టుకొని శవాన్ని కూర్చో బెట్టినారు.

పిండం పెట్టే రవిరెడ్డి గంగమ్మ చెరువు కట్టదగ్గ రుండే రాణిబావి కాన్నుంచి మూడు కడవల నీళ్ళు తెచ్చినాడు. మొదటి బిందె నీళ్ళు ధర్మారెడ్డి తలపైన గుమ్మరించినాడు. నీళ్ళు... నీళ్ళు... ఆకాశగంగ నేలకు దిగి ధర్మారెడ్డి తలపైన అభిషేకిస్తున్నట్లుంది.

రెండవ బిందె నీళ్లు... సప్త సముద్రాలు ఏకమై దాసోహం అంటున్నట్లు జాలు వారాయి. మూడవ బిందె నీళ్ళు... కరువును కరిగించి కురిసే తొలకరి చినుకుల వాన తడిపేస్తున్నట్లుంది మూడు బిందెల నీళ్ళు ముగిసాయి.

తడిసి ముద్దయిన ధర్మారెడ్డి పెదవులపైన అదే చిరునవ్వు....

పలకలు జెగ్గినక మోగుతానే వుండాయి.

నాటుసారా తాగినోళ్ళు తూగుతా వుండారు....

శవాన్ని పాడెమీదకు చేర్చడానికి పూనుకోగానే

భార్య యశోదమ్మ బిగ్గరగా ఏడుపు అందుకుంది.

ఆమెను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.

కూతురు శ్రీలక్ష్మి పడిపడి ఏడుస్తూనే వుంది.

కోడలు లావణ్య ఏడ్చి ఏడ్చి సత్తువ లేకుండా ఎక్కుల్లు

పెట్టి రోదిస్తా కుమిలిపోతా వుంది.

అందరి కళ్ళల్లోనూ ధారగా కన్నీళ్ళు.... నీళ్ళు... నీళ్ళు....

ఆకాశం నుంచి కన్నీటి చినుకులు...

జెగ్గినక్... జెగ్గినక్... జెగ్గినక్.. తప్పెట శబ్దం.

శవం పాడెపైకి చేరింది.

పాడెపైన పరిచిన తెల్లటి సైనుగడ్డలో శవాన్ని

తల కనిపించేలా కప్పి రాగినారతో శవాన్ని

పాడెలో కదలకుండా కట్టినారు.

శవం నోటిలో తాంబూలం పెట్టారు. నొసటన కుంకుమ బొట్టు దిద్ది మెడకు మొదటి పూల దండను నాగన్న వేసినాడు. పాడెకు ఒక వైపున సొద్ద చొప్పకింద వక్కలు ఆకులు వుంచాడు.

యిక తన పని పూర్తయ్యినట్లు... రెండు చేతులూ జోడించి మనస్ఫూర్తిగా అంతిమ నమస్కారం చేసు కున్నాడు... నాగన్న తల్లడిల్లిన కళ్ళలోని కన్నీళ్లతో.

బయట తప్పెట శబ్దం ఆగింది. తడిసిపోయిన గట్టి చిదుకు రగులుకొని ఆరిపోతా పొగపెడతా వుంది. ఆ సెగలోనే పలకలు తిప్పి సెగ పెట్టుకుంటా వుండారు ఓబన్న బృందం.

రవి రెడ్డి ఒక చేత్తో అగ్గి, మరో చేత్తో నీళ్ళు తీసు కొచ్చి శవం పాదాల దగ్గర పెట్టి టెంకాయకొట్టి సత్తు గిన్నెలో సాంబ్రాణి ధూపం నమస్కరించాడు. తర్వాత ఒక్కొక్కరుగా బంధుమిత్రులు, ఆత్మీయులు అంతిమ నమస్కారం చేసుకుంటా ఉండారు.

చుట్టు పక్క నలభై నాలుగు పల్లెలన్నుంచి వచ్చిన జనం వేసిన దండలతో ధర్మారెడ్డి ముఖం నిండి పోయింది. చల్లిన అత్తరు వాసన గుబాళిస్తోంది. పూల దండల మధ్య విప్పారిన ప్రొద్దు తిరుగుడు పువ్వు నవ్వుతున్నట్లు ధర్మారెడ్డి ముఖం... పలకలు మళ్లీ మోగడం మొదలైంది.

కన్నీటి సముద్రం ఒకటి బద్దలైనట్లు... వాయు గుండాన్ని రేపి వరద బీభత్సాన్ని సృష్టించినట్లు... అక్కడ వాతావరణమంతా ఏడుపుల శోక సముద్రంలో మునిగి పోయింది. కొత్త మూకుడులో వండిన బియ్యమన్నం – మూడు వెదురు దబ్బలకు రాగినారతో కట్టిన ఉట్టి సిద్ధమయ్యింది. తయారు చేసుకొచ్చినాడు అంకన్న.

జెగ్గినక్... జెగ్గినక్... జెగ్గినక్.... పలకల గోడు.

ఆకాశం మూగబోయింది. చినుకులు ఆగి పోయాయి.

'మళ్ళీ వాన ఎత్తుకుంటాదేమోన్న.. యల్లబారి పోతావుంటే సరిపోతాది...' అన్నాడు రవిరెడ్డి దిక్కు జూస్తూ నాగన్న.

అట్నే అన్నట్టు తలాడించినాడు రవిరెడ్డి.

పూల దండల్తో నిండిపోయిన పాడె దగ్గరికెళ్ళి పైనున్న దండలన్నీ ఒక్కొక్కటిగా తీసి పక్కన పెట్టినాడు.

జనం యింగా దండలు తీసుకొని వస్తానే వుండారు. చూసినోళ్ళు కన్నీళ్ళు ఆపుకోలేక వలవలా దుఖిస్తా వుండారు. ఒకవైపు పూలదండలు పడుతుంటే మరో వైపు నుంచి వాటిని తీసి పక్కన పెడతా అక్కడే నిలబడిపోయాడు నాగన్న.

ధర్మారెడ్డి ముఖంలో అదే ఆత్మీయ చిరునవ్వు...

'అన్నా ఆకాశంలో మళ్ళీ మోడాలు కమ్ముకుంటా వుండాయి. చినుకులెత్తుకుంటా యేమో...' లోపలికొచ్చి నాగన్న చెవిలో మాటేసి పోయినాడు అంకన్న.

నాగన్న ఇదే మాటను రవిరెడ్డికి చేర్చినాడు.

యిక ఆలస్యం చేయకుండానే... పాడె పైకి లేచింది.

నాలుగు వైపులా భుజాలు.... కన్నీటి సుడిగుం డాలు.... గోవిందా.... గోవిందా... జనం పిలుస్తు న్నారు.

బొరుగులు, పొప్పులు, చిల్లర డబ్బులు కలిపి చల్లుకుంటూ శవయాత్ర మొదలైంది. దాంతో పాటే ఊర్లకు ఊర్లు కదిలాయి ప్రవాహంలా!

ఒక మనిషిని జనం ఇష్టపడితే యింతటి ప్రజాభి మానం వుంటుందా... అంతిమ యాత్రకు ఇంతమంది తరలి వస్తారా.... తమ మనిషి చనిపోయినట్లు.... తమ ఆత్మీయుడు తమని విడిచివెళ్లినట్లు... తాము అభిమానించే మనిషి తమకు దూరమైనట్లు ఒక్కొక్కరు ఒక్కో శోకగీతమై...

ఇంకాసేపట్లో దింపుడు కల్లం వస్తుంది.

దింపుడు కల్లం.... ప్రతి ఊర్లోనూ ఒకటి వుం టుంది.

దీనికి తరతరాల చరిత్ర వుంటుంది. ఒక ఐతి హ్యాం.... శవాన్ని ఖననం చేయడానికి తీసుకెళ్తున్నపుడు మార్గమధ్యంలో శవం కదిలింది... పాడెను దించి చూశారు... ఆ వ్యక్తి బతికి వున్నాడు. అటువంటి అద్భుతం జరుగుతుందేమోననే ఆశతో ఇప్పటికే దీన్ని పాటిస్తున్నారు.

అలాంటి అద్భుతమే... అలాంటి ఆశే... మళ్ళీ ఇప్పుడూ... ఫలిస్తుందా?

దింపుడు కల్లం దగ్గరైంది. అందరిలోనూ ఆశ మరింత ఎక్కువైంది.

'ఏదైనా అద్భుతం జరిగి ధర్మారెడ్డి బతికితే బాగుండు'.

అందరిలోనూ ఇదే ఆకాంక్ష. నీళ్ళు చల్లి శవాన్ని దింపుడు కల్లంలో దించారు. ధర్మారెడ్డి పూల దండల మధ్య చిరునవ్వు మందారంలా మెరుస్తున్నాడు. అదే ఆత్మీయ నవ్వు.... 'దేవుడా... ఒక మంచి మనిషిని మళ్ళీ బతికించలేవా?'

అందరి హృదయాల్లోనూ ఒకే తీరని కోరిక.

కొత్త మూకుడు పట్టుకొని

శవం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు పూర్తయ్యాయి.

శవం తల దగ్గర ఆ మూకుడును వెనక నుంచి విడిచి పెట్టగా 'దభీ'మని పగిలింది. రవిరెడ్డి కళ్ళల్లో ఎక్కడో ఆశ. దింపుడు కల్లం ఆశ... తండ్రి మళ్ళీ కళ్ళు తెరుస్తాడేమోనని... అందరిలాగే తాను కూడా కాసేపు మౌనంగా ధర్మారెడ్డి ముఖం వైపే చూస్తుండి పోయాడు.

ఆశ... నిరాశగా మారింది.

పాడెను మోసిన కుడివైపు వారు ఎడమ వైపుకు ఎడమ వైపు వారు కుడివైపుకు మారారు.

వెంటవచ్చిన చాలామంది ఆడవాళ్ళు బాధతో మూడేపమాన్ల సత్రం దగ్గరే కూలబడిపోయారు.

దింపుడు కల్లం ఆశ ఫలించలేదు.

పాడె మళ్ళీ పైకి లేచింది.

గుండె జారిపోయినట్లు అయ్యింది.

ఆ తర్వాత ఖనన కార్యక్రమాలన్నీ ఒక దాని తర్వాత ఒకటి చకచక జరిగిపోయాయి. దానం చేయ డం పూర్తయ్యాక ఇంటికొచ్చానే గాని మనసు మనసులో లేదు. మాపటేల పొద్దు గూట్లో పడతాంది.

ముంచుకొచ్చిన ముసురు కమ్ముకునింది.

దట్టంగా పొగమంచు అల్లుకునింది. వానా గాలి లేచింది. యాడ జూసినా నీళ్ల సుళ్ళు తిరుగుతా దిగ దాల వంక లోకి పారతా వుండాయి.

నడి రాత్రి నిద్ర పట్టింది... కల... కదిలిపోతూ కదిలిపోతూ.... దింపుడు కల్లం దగ్గర ఆగింది.

అవును అక్కడ... పెద్దాయన... ధర్మారెడ్డి ... అందర్నీ అభిమానంగా పలకరిస్తూ... ఊరి జనానికి మంచి చెడులు చెబుతూ... అందరూ తన వాళ్లే అన్నట్లు.... ఆప్యాయంగా కలివిడిగా వుండే పెద్దా యన...

కల... కల... కరిగిపోతూ వుండాది... జీవితనది నిర్వేదంగా ప్రవహిస్తోంది.

ఆకాశంలో ఉరుములు, మెరుపులు.. వర్షం కురుస్తానే వుంది. శూన్యాన్ని మోస్తున్న చీకటి రాత్రి తూర్పుకొమ్మల ఆకాశంలో కరిగిపోతోంది. ■